www.prajasakti.com

సోమవారం 6 జనవరి 2025

5

చిత్తూరు

6న ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం నియోజకవర్గంలో ఈనెల 6,7వ తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో అధికారులందరూ నిమగ్నమై ఉన్నందున జిల్లా కేంద్రంలో ఈనెల 6న సోమవారం నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లా పోలీస్‌శాఖ ద్వారా సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కూడా సిఎం పర్యటన కారణంగా రద్దు చేస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.

నేడు జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి

స్వర్ణకుప్పం విజన్ 2025 ఆవిష్కరణ

ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 6వ తేదీ సోమవారం కుప్పంకు రానున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం పర్యటన లో భాగంగా ఈనెల 6, 7, 8వ తేదీలలో పర్యటించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు 6వ తేది సోమవారం ఉదయం 11.50 గంటలకు ద్రావిడ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారుల స్వాగతం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ద్రావిడ యూనివర్సిటీ ఆడిటోరియం చేరుకుని స్వర్ణకుప్పం విజన్ 2029ను ఆవిష్కరిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2.25 గంటలకు నడిమూరు గ్రామం చేరుకుని సోలరైజేషన్‌ను ప్రారంభించి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు సీగలపల్లి గ్రామం చేరుకుని ప్రకృతి వ్యవసాయ రైతులతో సంభాషణ, ప్రకృతి వ్యవసాయం విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, ఎన్‌ఓసిఎల్‌తో ఎంఓయు కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5.55 గంటలకు ద్రవిడ యూనివర్సిటీ ఆడిటోరియం చేరుకుని సమావేశం పాల్గొన్న రాత్రి 7.55 గంటలకు కుప్పం ఆర్ అండ్ బి అతిథి గృహంకు చేరుకుంటారన్నారు. పర్యటనలో రెండవ రోజు 7వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు కుప్పం ఆర్ యాడ్ బి అతిథి గృహం నుండి బయల్దేరి 10.05 గంటలకు కుప్పం టిడిపి ఆఫీస్‌కు చేరుకుని జననాయకుడు సెంటర్ ప్రారంభించి, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కంగుంది గ్రామం చేరుకుని శ్యామన్న విగ్రహ ఆవిష్కరణ, 1.20 గంటలకు కుప్పంలోని ఎన్‌టిఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ చేరుకుంటారని, తదుపరి 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం 5.05 గంటలకు శాంతిపురం మండలం కడపల్లిలోని సొంత ఇంటి వద్దకు చేరుకుంటారని, 6.10 గంటలకు ద్రావిడ యూనివర్సిటీ చేరుకుని అకాడమిక్ బిల్డింగ్‌లోని ఐఎంఐబి (కెరీర్ రెడీనెస్ సెంటర్)ను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ద్రావిడ యూనివర్సిటీలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి రాత్రి 7.45 గంటలకు ఆర్ అండ్ బి అతిథి గృహం చేరుకొని రాత్రికి బస చేస్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

బాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

బందోబస్తు ఏర్పాట్లు పూర్తి : ఎస్పీ

చిత్తూరు అర్బన్: 6,7, 8వ తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం బందోబస్తులో సుమారు 1200 మంది పోలీసు సిబ్బంది ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆదివారం సీఎం బందోబస్తు పై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు పటిష్ఠంగా ఉండాలని పోలీసులకు సూచనలు చేశారు. అలాగే సిఎం తిరుగు ప్రయాణం అయ్యే వరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి భద్రత కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులెన్స్, సేఫ్ హౌస్, సేఫ్ హాస్పిటల్, ఫైర్ అధికారులు ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.బందోబస్తు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ రూట్ మ్యాప్‌ను ప్రదర్శించి సిఎం పర్యటను గురించి వివరించారు. కాన్వాయ్‌లో ఉన్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎటువంటి పొరపాటుకు తావివ్వకూడదని వివరించారు. మీటింగ్ ప్లేస్, హెలిప్యాడ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, అధికారులు, ముఖ్యనాయకుల వాహనాలకు ఇతరుల వాహనాలనకు పార్కింగు స్థలాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

సిఎం పర్యటనకు సర్వంసిద్ధం

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం నియోజకవర్గ పర్యటనల భాగంగా 6,7 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కుప్పం పర్యటనలో భాగంగా నేడు గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీలో ఉదయం సుమారు 12 గంటల ప్రాంతానికి చేరుకుంటారని, ఈకార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ద్రావిడ యూనివర్సిటీ ప్రాంగణం పరిశీలించి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా పర్యటనకు సంబంధించి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్‌ను ఆదివారం గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియం నుండి ప్రారంభమై యూనివర్సిటీలోని సమావేశ మందిరం కుప్పం మండలం నడుమూరు, సీగలపల్లి మీదుగా ట్రైల్ రన్ నిర్వహించారు.

ఏర్పాట్లను పరిశీలించిన జెసి

కుప్పం రూరల్ : కుప్పం మండలం నడిమూరు గ్రామంలో పియం సూర్యఘర్ పథకం ప్రారంభోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పర్యవేక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం కుప్పం మండలం నడుమూరు గ్రామంలో పియం సూర్యఘర్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్ కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేసి, అనంతరం గ్రామంలో ముఖ్యమంత్రి పాల్గొనే సభ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో కలసి పరిశీలించి, ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఖరీఫ్ కరువు

రాయితీలపై అన్నదాతల ఆశలు

- నివేదికలతో సరి నష్టపరిహారం ఏది..?
- కరువు మండలాల్లో రైతుల.. ఎదురుచూపులు
- 16 మండలాల్లో 9068.88 ఎకరాలు
- అంచనా వ్యయం 1,542 లక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు : ఖరీఫ్ పంట నష్టపరిహారంపై జిల్లాలోని కరువు మండలాల్లోని రైతులు పంట నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటపై రైతులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో పడకపోవడంతో కనీసం ఖర్చుపెట్టిన దిగుబడి కూడా రైతు చేతికి అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ సంవత్సరంలో ఖరీఫ్ పంటవేసి నష్టపోయిన రైతుల జాబితాను వ్యవసాయశాఖ అధికారుల సేకరించారు. జిల్లాలో 16 మండలాల్లో 24,342మంది రైతులను గుర్తించారు. 9068.88 ఎకరాల్లో పంట నష్టం వాటిలిందని వ్యవసాయ అధికారులు గుర్తించారు. జిల్లా వ్యవసాయ అధికారులు 1,542 లక్షల రూపాయలు నష్టపరిహారం అంచను తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలు నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు ఎలాంటి నిధులను మంజూరు చేయలేదు.

పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు..

బి.గోపాల్ రెడ్డి, ఆరిమాకులపల్లె, రైతు

గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట వేసాం. వేరుశెనగ పంట విత్తేందుకు, పొలం దున్నడానికి, విత్తుడం, పొలంలో కలుపు తీయడం వేరుశనగను ఒబిడి చేయటం ఇవన్నీ కలుపుకుంటే ఎకరాకు 25 వేల రూపాయలు ఖర్చు అయ్యింది. గత సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో వేరుశనగ పంట చేతికి అందలేదు. ఎకరాకు 15 మూటలు రావలసిన వేరుసెనగ కేవలం మూడు మూటలు మాత్రమే వచ్చింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు దీంతో తీవ్రంగా నష్టపోయాం.

ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

పి.లత, కొత్తూరు, మహిళా రైతు

ఎకరా వేరుశనగ పంట వేసేందుకు 20 వేలు అప్పు చేసాం. వర్షాలు లేక వేసిన పంట చేతికి రాకపోవడంతో నష్టపోయాం. ఇంతవరకు అప్పు కట్టలేదు. వ్యవసాయ అధికారులు మా పొలంకు వచ్చి వివరాలు అడిగి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందని ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం..

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి

ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంటలో నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాం. పంట నష్ట పరిహారం వివరాలను ప్రభుత్వంకు నివేదికలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చి వెంటనే రైతులకు పరిహారం చెల్లిస్తాం.

రైతుల పంట పొలాల్లో నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు

జ్వరాలతో వణుకుతున్న ఓటేరుపాళ్యం

- పొంగిపొర్లుతున్న మురుగునీటి కాలువలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో ఉన్న ఓటేరు పాళ్యంలో విష జ్వరాలతో ప్రజలు వణుకుతున్నారు. నిత్యం రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండంతో దోమలు విపరీతంగా పెరిగి గ్రామంలోని చిన్నారులతోపాటు వృద్ధులు జ్వరాల భారిన పడుతున్నారు. గత నెలలో డెంగీతో ఓ విద్యార్థిని కూడా మృతి చెందిన విషయం విధితమే. అప్పటి నుంచి కూడా ఈ గ్రామంపై అధికారులు దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం గ్రామంలో అధికశాతం ప్రజలు విష జ్వరాల భారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు గ్రామంలో పర్యటించడం గానీ, అపరిశుభ్రంగా ఉన్న మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం, దోమల నివారణకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి గ్రామస్తులను ఆదుకోవాలని కోరుతున్నారు.

వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

సమిష్టి కృషితో జిల్లాలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమిష్టి కృషితో జిల్లాలోని 66 మండలాలను అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా పరిషత్ ఎగ్జిక్యూటివ్ అధికారి రవికుమార్ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వానికి నిధుల కోసం నివేదికలు పంపడం జరిగిందన్నారు. రానున్న వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా పరిషత్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

రవికుమార్, జిల్లా పరిషత్ సీఈవో

ప్రజాశక్తి: జిల్లా పరిషత్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను ఏ మేరకు నిధులు ఖర్చు అంచనా వేస్తున్నారు?

జెడ్పీ సీఈవో: రూ.11 కోట్లు జెడ్పీ నిధులు జిల్లాలో అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించడం జరిగింది. అలాగే మండల పరిషత్‌కు రూ.5.54కోట్లు విడుదల చేయడం జరిగిందని, అలాగే రెండు కోట్లు నిధులతో జిల్లా పరిషత్ వనరుల కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి: జిల్లా పరిషత్ అతిధి గృహం ఆధునీకరిస్తారా..?

జెడ్పీ సీఈవో: జిల్లా పరిషత్ అతిధిగృహం పురాతన భవనం కావడం ద్వారా పూర్తిగా దెబ్బతింది. ఆ ప్రదేశంలో నూతన భవన నిర్మాణం కోసం రూ.50లక్షలు కేటాయించడంతో పాటు జిల్లా పరిషత్ భవనాన్ని ఆధునీకరిస్తున్నాం. మరుగుదొడ్లు, వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం.

ప్రజాశక్తి: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జెడ్పీ సీఈవో: ఉమ్మడి జిల్లాలో రానున్న వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకొనేలా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఈ మేరకు తాగునీటి కోసం రూ.1.5 కోట్లుతో ప్రణాళిక తయారు చేశాం. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశాలున్నాయని సమన్వయంతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ప్రజాశక్తి: 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయా..?

ఇంటర్వ్యూ

జెడ్పీ సీఈవో: జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11కోట్లు రెండు విడతల్లో విడుదల చేయడం జరిగింది. ఈ నిధుల్లో 12 శాతం తాగునీరు, 23 శాతం అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయనున్నాం.

ప్రజాశక్తి : కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లిస్తున్నారు..?

జెడ్పీ సీఈవో: గత ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లుకు రూ.12 కోట్లు మేర బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం రూ.8కోట్లు వరకు చెల్లించాం. బకాయిల చెల్లింపు విషయంలో ఆందోళన చెందకుండా జిల్లా పరిషత్ చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లును కోరాం.

ప్రజాశక్తి: జిల్లా పరిషత్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తున్నారు.....?

జెడ్పీ సీఈవో: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా పరిషత్ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోంది.

అండగా నిలిచిన దళిత సంఘాలు

- గాయపడిన వారికి రిమాండు...
- కొట్టిన వారికి రక్షణా..?
- ఏకపక్షంగా పోలీసుల వైఖరి
- ఆగ్రహం వ్యక్తం చేసిన నేతలు
- దళితులు ఏకం కావాలని పిలుపు

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని తడుకు దళిత వాడలోని బాధిత దళితులకు పలు దళిత సంఘాలు అండగా నిలిచాయి. ఆదివారం సాయంత్రం ఆల్ ఇండియా అంబేద్కర్ అసోసియేషన్, బీఎస్‌పీ, బీపీఎఫ్, వీజీకే, నీలం పన్నాట్టుమయ్యం, బీపీఎఫ్, ఏపీఎల్ఎఫ్, అంబేద్కర్ ఆర్మీ, న్యాయవాదుల సంఘం, తిరుపతి అంబేద్కర్ భవన్ నేతలు, తిరుమల ఉద్యోగుల సంఘనేతలు అంటూ మన రాష్ట్రంతో పాటు, తమిళనాడు నుంచి పలువురు తడుకు దళితవాడకు విచ్చేశారు. బాధితులను పరామర్శించారు. గొడవ జరిగిన విధానంపై ఆరా తీశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దళితులపై జరిగిన ఈ దాడిని ఖండిస్తున్నామన్నారు. దళితులపై దాడులు పెరుగుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. దెబ్బలు తిన్న దళితులను రిమాండ్‌కు పంపి కొట్టిన వారికి రక్షణ కల్పిస్తున్నారు. అగ్రకులస్థులను పరామర్శించిన ఎమ్మెల్యే గాయపడిన దళితులను ఎందుకు పరామర్శించలేదన్నారు. ఆయన అగ్రకులస్థులకే ఎమ్మెల్యేనా అంటూ ప్రశ్నించారు. దీనిపై అధికార పార్టీలో ఉన్న దళితులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. దళితులకు న్యాయం జరగాలంటే ఐక్య పోరాటం తప్పదన్నారు. మిగిలిన సంఘాలను ఏకం చేసుకొని న్యాయం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత దళితుల తరపున వైస్‌ఎంపీపీ కన్నియప్ప డీఎస్పీ సాయినాథ్, సీఐ మహేశ్వర్‌లకు మరోమారు ఫిర్యాదు అందించారు. అంబేద్కర్ భవన్ చైర్మన్ పరమశివం, టిటిడి ఉద్యోగ సంఘ అధ్యక్షులు ప్రసాద్ రావు, అంబేద్కర్ ఆర్మీ ఫౌండర్ ఈ.గోపి, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొకం రమేష్, నగరి నియోజకవర్గ కన్వీనర్ ఎం.బాబు, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నాగూర్, ఎస్ఎస్‌డి చిరంజీవి, ఏపీఎల్ఎఫ్ నాయకుడు శేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, న్యాయవాదుల సంఘం నాయకులు బాబు, నాగరాజు పాల్గొన్నారు.

దళితవాడలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

గణిత ఉపాధ్యాయుల కృషి గొప్పది

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని చిత్తూరు పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక విజయం కళాశాలలో గణిత ఫోరం, ఏపీ ఎంఎఫ్ సమావేశం ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రమ నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గణిత ఫోరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గణితంలో మెలుకువలు నేర్పించి పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు కొనియాడారు. ఈసమావేశంలో మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని లహరి 1000 గణిత ప్రశ్నలకు సమాధానం చెప్పారు. చిత్తూరు, పూతలపట్టు శాసనసభ్యులు గణితపురం కృషిని అభినందిస్తూ లహరికి రూ.50వేలు, ఏపీ ఎంఎఫ్‌కు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. లహరికి శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయులు అరుణ శివప్రసాద్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత ఫోరం, ఏపీ ఎంఎఫ్ బృందం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే

విఘ్నేశ్వరుడి సేవలో మడకశిర ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి సేవలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం వినాయక స్వామివారి దర్శనార్ధం కాణిపాకంకు విచ్చేసిన ఎమ్మెల్యే రాజుని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ కాణిపాకం అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఆలయ వద్దకు చేరుకున్న వీరికి కాణిపాకం ఈవో పెంచల కిషోర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనంతరం ఆలయ వేద ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.

పెరిగిన చలి తీవ్రత

చలిమంటలతో ఉపశమనం పొందుతున్న జనం

ప్రజాశక్తి- సోమల: గత మూడు రోజులుగా చలితీవ్రత మండలంలో పెరగడంతో ప్రజలు చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలైనా ఎండ జాడ లేకుండా మంచు దట్టంగా ఉంటూ ప్రజలు గూడు దాటి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. కూలి పనులకు వెళ్లే కూలీలు కూడా 10 గంటల తరువాత పనులకు వెళుతూ సాయంత్రం నాలుగు గంటలకు ఇండ్లకు చేరుకుంటున్నారు. కాగా రోజంతా ఎండ కాస్తూనే ఉన్నా చలి మాత్రం తగ్గడం లేదు. సాయంత్రం వేళలో ఆరు గంటల నుండి చలి తీవ్రత పెరుగుతూ 9 గంటల తర్వాత అధికమవుతూ వస్తూ ఉంది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇండ్లలో నుండి బయటకు రాలేక వెచ్చదనం కోసం స్వెటర్లు దుప్పట్లు కప్పుకుంటున్నారు. గతంలో ఇంత చలి తీవ్రత మండలంలో ఎప్పుడు లేదని పెద్దలు అంటున్నారు.

జనారణ్యంలోకి కొండచిలువ

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని ఆళ్లమడుగు గ్రామంలోకి కొండచిలువ వచ్చింది. ఆదివారం గ్రామంలోని పిల్లలు ఆడుకుంటూ ఉండగా ఈ కొండచిలువ ప్రత్యక్షమైంది. దీంతో పిల్లలు, మహిళలు కేకలు వేస్తూ ఇళ్లలోకి పరుగులు తీశారు. దీంతో గ్రామస్తులు కొండ చిలువను కర్రలతో చంపేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభించిన విజయానంద రెడ్డి

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి ఎంసి విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో క్రికెట్ ప్రీమియం లీగ్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు భువనేష్, యువరాజ్, తేజుప్రసాద్, గిరి చౌదరి, లలిత్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ వైసిపి క్రీడాభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించిందని గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం ఎక్కువ ప్రోత్సాహం కల్పించిందని తెలిపారు. సర్పంచ్ డివి.ఢిల్లయ్య, నాయకులు విజయబాబు , కోటిరెడ్డి బాబు, దేవరాజు రెడ్డి, యుగంధర్, సుధాకర్ పాల్గొన్నారు.

విమర్శించే అర్హత జగన్‌కు లేదు

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయుల జీతాలు విషయంలో విమర్శించే అర్హత జగన్మోహన్ రెడ్డికి లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 5వ తేదీ అయినా కూడా ఉధ్యాయులకు జీతాలు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ ఎలా చేసుకోవాలని విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. గత ఐదు సంవత్సరాలు వైసిపి పరిపాలనలో ఉపాధ్యాయుని హింసించిన ఘటనలు, చేసిన మోసాలకు సంబంధించి ఉపాధ్యాయులకు జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి జయచంద్ర నాయుడు, కార్యదర్శి బాబు నాయుడు, జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మాహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో ఆదివారం కుప్పం పిఇఎస్ ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ అర్చన తెలిపారు. మండలంలోని 34 మంది హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. వీరిలో ఆరుగురికి ఆపరేషన్ చేయవల్సి ఉందని గుర్తించారు. వీరికి ఫౌండేషన ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయించి మళ్లీ తిరిగి ఇంటి వద్దకు బస్సులో చేర్చుతామని మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు.

దివ్యాంగులకు పరికరాలు పంపిణీ

వికలాంగులకు పరికరాలను పంపిణీ చేస్తున్న చల్లా బాబు

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలో మీ నేస్తం దివ్యాంగుల సంఘం వారి ఆధ్వర్యంలో వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, సంక కర్రల వంటి పరికరాలను నిరుపేదలైన దివ్యాంగులకు పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు తమ సమస్యలను చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు అనేక పథకాలు ఇస్తున్నాయని, వాటిని దివ్యాంగులకు అందేలా తప్పకుండా చర్యలు తీసుకుని వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీనివాసులు, మీ నేస్తం దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షులు ఇర్షాద్, కమిటీ సభ్యులు అబ్దుల్ రెహమాన్, దిలీప్, బావా జాన్, వాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్స్ అసోషియేషన్ అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. నాయకులు ఆత్మానంద నాయుడు, శ్రీరామమూర్తి, కుమారవర్మ, ఏకంబర నాయుడు, లక్ష్మియ్య, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: చలమంగళం గ్రామంలో అంబేద్కర్ చిత్రపటంతో కూడిన క్యాలెండర్‌ను జై భీమ్ యువజన సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. మండలంలోని గోనుమాకులపల్లి జై భీమ్ యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు జి.శంకర్ ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు జల్లి అమర నారాయణ, బాబు, నాగరాజు, కన్నయ్య, రమణ పాల్గొన్నారు.

కాకినాడ యుటిఎఫ్ మహాసభల్లో మండల నాయకులు

కాకినాడలో యుటిఎఫ్ మండల నాయకులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలోని కాకినాడలో జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో మండల యుటిఎఫ్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుండి వేలాది మంది యుటిఎఫ్ పతాకాలు చేతబట్టి వారి హక్కుల సాధన కోసం నినాదాలతో సభా ప్రాంగణంలో హోరెత్తించామని అన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, సమస్యలను, వెంటనే పరిష్కరించాలని, లేనియడల పెద్దఎత్తున పోరాటాలు చేయడానికి వెనుకాడబోమ అన్నారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వర రావు ద్వారా ప్రభుత్వానికి వివిధ సమస్యలను తెలియజేసినట్లు తెలిపారు. రమణ శ్రీనివాసులు, శంకర్ రెడ్డి, యుగంధర్, వెంకటేష్, బాలాజీ, నరసింహులు పాల్గొన్నారు.

రేపు శ్రీవారి ఆలయంలో

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తారు. జనవరి 7వ ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామి వారి మూల విరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామి వారి మూల విరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్యం కార్యక్రమాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. 7వ తేది కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6వ తేది సిఫార్సు లేఖలు స్వీకరించరు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది.

'పోలీసులు రక్షణ కల్పించాలి'

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం అనిమిగానిపల్లి ప్రాంతానికి చెందిన తల్లీకూతుర్లు లక్ష్మమ్మ, అన్నపూర్ణలు తమకు ప్రాణహాని ఉందని, పోలీసుల రక్షణ కల్పించాలని కోరుతున్నారు. వారు తెలిపిన మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తమ కుటుంబ సభ్యుడు అయిన రవిచంద్ర ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి అడ్డగించి, అవమానకరంగా మాట్లాడుతూ అనవసరంగా గొడవకు దిగినట్టు తెలిపారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ముందుగానే పన్నిన పథకం ప్రకారం బాధితునిపై దాడిచేసి, మారనాయుధాలతో హత మార్చడానికి ప్రయత్నించినట్టు ఆరోపించారు. దాడిలో గాయపడ్డ క్షతగాత్రున్ని వైద్యపరీక్షల నిమిత్తం పిఇఎస్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు. తమ కుటుంబ సభ్యుడిపై దాడి చేసిన వారి నుండి తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, తమ కుటుంబ సభ్యులలో ఎవరికి ఏమి జరిగినా అందుకు రవిచంద్రపై దాడి చేసిన వారే కారుకులవుతారని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ తెలియపరుస్తూ పోలీసులను ఆశ్రయించడం జరిగిందని, పోలీసులే తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పాత్రికేయులతో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం తప్పదు

ఎస్‌టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలు సంక్రాంతి లోపు చెల్లించకపోతే ఉద్యమం చేపట్టడానికి సిద్ధపడతామని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కార్వేటినగరంలో స్థానిక హిందూ ముస్లిం కళ్యాణ మండపంలో ఆదివారం సంఘ 78వ జిల్లా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ నెలసరి జీతాల నుండి పొదుపు చేసుకున్న పిఎఫ్, ఏపీజిఎల్ఐలకు సంబంధించి రుణాలు, తుది చెల్లింపులు, సంపాదిత సెలవులు నగదు చెల్లింపు బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉందన్నారు. వెంటనే బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాధ్యక్షుడు గంటామోహన్, రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమచంద్ర రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోడే మోహన్, ఆర్థిక కార్యదర్శి తన్నీరు యువరాజు తదితరులు పాల్గొన్నారు.

కైగల్ జలపాతం వద్ద అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మూడు రాష్టాలకు చెందిన పర్యాటకులను ఆకర్షిస్తున్న జలపాతం కైగల్ జలపాతం. ఈ జలపాతంలో నీరు ఉన్న లేకున్నా అక్కడ నెలకొన్న ప్రకృతి అందాలు, పక్షుల కిలకిల రావాల సందడి, అక్కడి చల్లటి వాతావరణాన్ని ఆశ్వాదించడానికి పర్యాటకులు మూడురాష్టాల నుండి వస్తుంటారు. వారాంతం సమయాల్లో ఇక్కడ జనాల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. కానీ ఎన్నడూ లేని మచ్చ నేడు కైగల్ జలపాతంకు అంటించారు. ఒక్కసారిగా సోషియల్ మీడియాలో చక్కర్లు కొట్టే విధంగా పర్యాటకులపై దౌర్జన్యంకు దిగారు. ఎక్కువ మొత్తంలో టోల్ వసూల్‌పై పర్యాటకులు నిలదీశారు. కానీ టోల్ వసూల్ చేసే యజమాని తీర్థం పంచాయతీకి రూ.6లక్షలు కట్టాం.. మాకు అనుమతి ఇచ్చారు.. ఏకంగా బైరెడ్డిపల్లి ఎంపీడీఓ చెప్పారంటూ పర్యాటకులను దుర్భశలాడుతూ దౌర్జన్యంకు దిగారు.. పర్యాటకులు సెల్‌ఫోన్‌లో వారి దౌర్జనపు మాటలు చిత్రికరిస్తుంటే కెమెరా సాక్షిగా దాడికి దిగారు. పర్యాటకులను దూషించే హక్కు, అక్రమ వసూల్, కౌండిన్య వైల్డ్ సంచురీ పరిధిలోకి వస్తుంది. అలాంటి చోట వసూల్ చేయడం ఏమిటని గట్టిగా ప్రశ్నించారు.. ఇక్కడ నెలకొన్న అక్రమ వసూళ్ళు, దౌర్జన్యంను అధికారులు కట్టడి చేయాలి, గత 2రోజులుగా సోషియల్ మీడియాలో ఈ వీడియో చక్కర్లు కొడుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో విచారణ కోరగా పంచాయతీ ఎలాంటి పైకం చెల్లించలేదని పంచాయతీ సెక్రటరీ ద్వారా అక్కడ జరిగిన విషయాలు తెలుసుకుంటామని త్వరలో పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు.

సంక్రాంతికి చంద్రన్న కానుక అందేనా..?

- 2014లో టిడిపి సర్కారు పంపిణీ
- పండుగ సమీపిస్తున్నా కానరాని ప్రకటన
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సంక్రాంతి కానుక కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. పండగ వచ్చే వారం నుంచి మొదలు కావడంతో కూటమి ప్రభుత్వం కానుక రేషన్ షాప్ ద్వారా ఇస్తుందా? లేదా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి ప్రకటన రాలేదు.

2014లో టిడిపి సర్కారు పంపిణీ

2014లో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన 'చంద్రన్న సంక్రాంతి కానుక'ను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎత్తి వేసింది. టిడిపి పాలనలో పండుగల వేళ కొన్ని సరుకులను లబ్ధిదారులకు అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కేవలం బియ్యం, పంచదార, కందిపప్పు మాత్రమే పంపిణీ చేసింది. చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు కానుకల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి చంద్రన్న కానుకను అందజేస్తారా? లేదా? అనే ప్రశ్నలు సర్వతా వ్యక్తం అవుతున్నాయి. క్రిస్మస్ కానుకను మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని పలువులు లబ్ధిదారులు కోరుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం 2019 వరకు పండుగల వేళ కానుకలు అందించింది. అప్పట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 11లక్షల 50 వేల 758 రేషన్ కార్డులుండగా 30 శాతం మందికి రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలను అందించారు. మిగిలిన సుమారు 11 లక్షల 55 వేల మందికి సంక్రాంతి కానుకలను అందించారు. జిల్లా వ్యాప్తంగా రెండూ కలిపి 825 టన్నుల 279 కేజీల కందిపప్పు, 11లక్షల 49 వేల 681 కేజీల పామాయిల్, 11లక్షల 50 వేల 758 కేజీల గోధుమపిండి, 825 టన్నుల 280 కేజీల శనగపప్పు, 824 టన్నుల 923 కేజీల బెల్లం, 11లక్షల 49 వేల 710 (100 గ్రాములు) నెయ్యి ప్యాకెట్లును అందించారు. ఒక్కో కార్డు దారునికి రూ.207.94 పైసలు విలువ చేసే కేజి గోధుమ పిండి, అర కిలో చొప్పున బెల్లం, పామాయిల్, శనగ పప్పు, కందిపప్పు, 100 గ్రాముల నెయ్యి, ఒక సంచిలో అందించారు.

ఈ సంక్రాంతికి అనుమానమే.!

ఈ సంక్రాంతికి ప్రత్యేక కానుకలు లేనట్లేనని తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబు సర్కారులో ఏటా ఈ పథకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.287 కోట్లు ఖర్చు చేసేవారు. కార్డుదారులకు ఆరు రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేసేవారు. అయితే ఈ ఏడాది సంక్రాంతి సమీపిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇవ్వాలని అనుకుంటే జనవరి 1వ తేదీ నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. దీని గురించి కానీ జిల్లాలో అటువంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు. ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం గత ఐదేళ్లకు ముందు అమలు చేసిన అనేక పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పింది. చివరకు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలను కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో మాత్రం కానుకల సంగతిని: కూటమి పాలకులు మర్చిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వాస్తవానికి ప్రజలు ఎంతో ఆదరించిన చంద్రన్న సంక్రాంతి కానుకలు మళ్లీ ఇస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎటువంటి ఆసక్తి చూపకపోతుండడంపై సంక్రాంతి కానుక పథకం అమలయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోవడంతో నెలనెలా పించన్లు, జీతాలకే గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం దూరంగా ఉండటం గమనార్హం.

పట్టుకో దమ్ముంటే పట్టుకోండి..!

- పాత వేపకుప్పంలో రంకేసిన కోడె గిత్తలు
- ఉత్సాహంతో ఉరకలేసిన యువకులు
- వైభవంగా పరుష పందేలు

ప్రజాశక్తి -రామచంద్రపురం

'పట్టుకో.. పట్టుకో.. దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకోండి' అంటూ యజవ ానులు పశువులను వదలడంతో రంకెలేసి పరిగె త్తాయి. ఆదివారం రామచంద్రాపురం మండ లంలో పాత వేపకుప్పంలో కోడి గిత్తలు రంకె లేశాయి..యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. రామచంద్రపురం మండలం, పాత వేప కుప్పం గ్రామంలో సంక్రాంతికి ఎనిమిది రోజులు ముందే పరుష పందేలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడెగిత్తలు ఆవులను రైతులు వాటి కొమ్ములకు రంగులు వేసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. కోడెగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల పారితోషికంగా నగదును కట్టి 'నా కోడి గిత్తల పౌరషం చూడండి...' అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం..' అంటూ నగదు విలువైన పలకలు, దుస్తులను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి బరిలోకి దించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు వాటికి కట్టిన నగదు పలకలను చేజిక్కించేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తుతుండగా యువకులు పౌరుషంతో పశువులు, కోడిగిత్తల కొమ్ములకు కట్టిన పలకలను చేజిక్కించేదకు పోటీ పడ్డారు. ఈ పోటీలో మూగ జీవాలయిన కోడెగిత్తలు బెదిరి ముందుకు పోగా యువకులు వాటిని పట్టుకునేందుకు ముందుకు వచ్చే క్రమంలో చదురు మదురసంఘటనలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందేలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో కొత్త శానంబట్ల గ్రామం జనసంద్రమైంది. కోడి గిత్తల కొమ్ములకు పశువుల యజమానులు తమ అభిమాన రాజకీయ నాయకుల ఫొటోలు పార్టీ జెండాలతో చెక్క పలకను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జట్లుగా ఏర్పడి కోడె గిత్తలకు కట్టిన పలకలను చేజిక్కించుకున్న ఆనందంతో ఎగిరి గంతులు వేశారు. మందుబాబుల ఆగడాలు చెప్పనలివి కాలేదు. వారి లోకం వారిదే అన్నట్లు సరదాగా గడిపారు. పరుష పందేలకు విచ్చేసిన జనానికి స్థానికులు అన్న పానీయాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- విజయపురం: రోడ్డు ప్రమాదంలోని పాతార్కాడు ఆది ఆంధ్రవాడకు చెందిన తండ్రి అంకయ్య (27), కూతురు మోక్షిత(4) మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు అతని భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సమీపంలోని తమిళనాడు రాష్ట్రం కనకమ్మసత్రంకు కిరాణ సామగ్రి, కూరగాయలు తీసుకురావడానికి ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తమిళనాడు రఘునాథపురం వద్ద ఎదురుగా చెన్నై వైపు వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో అంకయ్య, మోక్షితకు తీవ్రగాయాలై చెన్నై జీహెచ్‌కు తరలించగా మార్గమధ్యమంలో మోక్షిత చనిపోయింది. అంకయ్య చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య రమ్య, కుమార్తె పూర్ణిమ స్వల్ప గాయాలై చికిత్స పొందుతున్నారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట రోడ్డు సమీపంలో టాటా ఏసీ వాహనం ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ వాహనం పచ్చికాపల్లం వైపు వస్తుండగా అదుపు తప్పి బోల్తా పండిందని ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడని, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

సీసీ కెమెరాకు చిక్కిన దొంగ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): గ్రామ దేవత ఓరుగుంటాలమ్మ ఆలయం తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడిన వ్యక్తి సీసీ కెమెరాకు చిక్కాడు. సుమారు 50 సంవత్సరాలు ఉన్న ఈ దొంగ మంకీ క్యాప్, చేతికి గ్లౌసు ధరించి ఒక ఇనుపరాడ్‌తో ఆలయంలోకి చొరబడ్డారు. ఒక్క రాడ్ సాయంతోనే హుండీకి ఉన్న మూడు తాళాలు, ఆలయానికి, గర్భాలయానికి ఉన్న తాళాలు పగలగొట్టి దర్జాగా దోచుకెళ్లడం రికార్డు అయింది. సుమారు గంటకుపైగా ఆలయంలోనే ఇటు అటూ తిరుగుతూ దొంగిలించుకు వెళ్లాడు. దీని ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తృటిలో పెనుప్రమాదం తప్పడంతో పలువురికి స్వల్పగాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని మొగలిగాట్‌లో చోటు చేసుకున్నది. ఏఎస్ఐ మల్లప్ప తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతామణి నుంచి మేల్మరుగుత్తూరు వెళ్తున్న భక్తుల బస్సు ముందు వెళ్తున్న ఐచర్ వాహనం స్పీడ్ బ్రేకర్ వద్ద బ్రేక్ వేయడంతో అతివేగంగా వస్తున్న ఓం శక్తి బస్సు ఐచర్‌ను ఢీకొని పక్కనే ఉన్న డివైడర్ పైకి ఎక్కి పక్కకు ఒరిగింది. ఈ ప్రమాదంలో పద్మ, రత్న, మునెమ్మ, సుమితమ్మ, సరళ, రాకేష్, సరోజమ్మ, మాధవి, రూప, స్వాతి, వరలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని నేషనల్ హైవే అంబులెన్స్ ఎన్ఆర్ఐ శేఖర్ రెడ్డి ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైతు నేత 'దల్లేవాల్ ప్రాణాలు కాపాడండి' సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ రైతు నాయకుడు, జగ్జీర్ సింగ్ దల్లేవాల్ పంజాబ్‌లోని కనౌరి సరిహద్దుల్లో 40 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ప్రాణాలను కాపాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ, నవంబర్ 26వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టిన దల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. పంజాబ్ ప్రభుత్వం తమ ఆసక్తిని తెలిపి కేంద్ర ప్రభుత్వాన్ని చర్చలకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేసినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోగా కనీస స్పందన వ్యక్తం చేయకపోవడం అన్యాయమన్నారు. వృద్ధాప్యంలో ఉన్న దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతోందని, దేశ వ్యాప్తంగా ఆయనకు మద్దతు వెల్లువలా వస్తుందన్న విషయాన్ని గమనించకుండా 'మమ్మల్ని ప్రశ్నిస్తారా?' అనే దురహంకారంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత అమానుషంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, తక్షణం రైతు నాయకుల బృందాన్ని చర్చలకు ఆహ్వానించాలని, రైతు సమస్యలపై సానుకూలంగా స్పందించాలని దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు.

ఎడ్విన్ జర్నల్ ఎటోరియల్ మెంబర్‌గా ఆచార్య దేవప్రసాదరాజు

ప్రజాశక్తి - క్యాంపస్ : సైన్స్ రంగంలో ప్రఖ్యాత జర్నల్ రెడ్విన్ ఎడిటోరియల్ మెంబరుగా ఎస్ వి యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ ఆచార్య బి.దేవప్రసాద్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు జర్నల్ ఇండియన్ ప్రతినిధి ఒబిరియన్ తెలిపారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ఆచార్య దేవప్రసాద రాజు బోధన, పరిశోధన, విస్తరణ, పాలనా రంగాల్లో విశేష కృషి చేశారు. ఎలక్ట్రాన్ ప్యారా మాగ్నెటిక్ ప్రత్యేక అంశంపై పరిశోధనలు చేశారు. ఈ క్రమంలో వీరు రూపొందించిన 110 పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. ఒక పుస్తకం, మూడు బుక్ చాప్టర్స్, నాలుగు పరిశోధనా ప్రాజెక్టులు, వివిధ సదస్సులు, వర్క్ షాప్ లు నిర్వహించారు. వర్సిటీ అడ్మిషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ గా , హాస్టల్ వార్డెన్ గా, రీసెట్ కన్వీనర్ గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా పనిచేశారు. ఇప్పటికే అప్లైడ్ సైన్స్ , మెటీరియల్ సైన్స్, నానో సైన్స్, కరెంట్ రీసెర్చ్ ఇన్ ఫిజిక్స్ వంటి జర్నల్స్ కు అసోసియేట్ ఎడిటర్ గా పనిచేస్తున్నారు. తొమ్మిది సైన్స్ జర్నల్ కు సమీక్షకుడిగానూ ఉన్నారు. ఐదు ప్రముఖ సైన్స్ రంగ సంస్థల్లో సభ్యులుగానూ ఉన్నారు. వీరి పర్యవేక్షణలో 12 పీహెచ్డీలు, 2 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఎడ్విన్ జర్నల్ ఎటోరియల్ మెంబర్ గా నియమితులైన ఆచార్య దేవప్రసాదరాజును పలువురు అభినందించారు.

రేపు రెవెన్యూ , రీసర్వే అంశాలపై వర్క్ షాప్: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 7వ తేదీన మంగళవారం సీసీఎల్ఏ మంగళగిరి కార్యాలయంలో ఆర్‌డీవోలకు, సబ్ కలెక్టర్‌లకు, రెవెన్యూ, రీ సర్వే అంశాలపై వర్క్ షాప్ నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు, గూడూరు సబ్ కలెక్టర్ సీసీఎల్ఏ వర్క్ షాప్‌నకు హాజరు కానున్నారని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.